www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 21 | ఆగస్టు | 2026 పేజీలు : 8

## ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో విలీనం చేయండి

### - సదరన్ కౌన్సిల్ సమావేశంలో తుమ్మల


(ఫైల్)

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణాలో విలీనం చేసిన ఐదు గ్రామ పంచాయితీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని తుమ్మల నాగేశ్వరరావు పలు అంశాలు కేంద్ర మంత్రి అమీత్‌షా, ఏపి సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మహబలిపురంలో జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి తుమ్మల పలు అంశాలు వారి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణాలోని భద్రాచలం పరిసర ప్రాంతమైన ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల ఐదు గ్రామ పంచాయితీలను 19 రెవెన్యూ గ్రామాలను తిరిగి తెలంగాణాలో విలీనం చేయాలని చెప్పారు. పరిపాలన పరమైన చిక్కులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధణకు ఏపి ఏటా నిధులను విడుదల చేయాలని, ఆయిల్ ఫామ్ గెల టన్నుకు రూ.25 వేల వరకు ఇచ్చేలా కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా భద్రాచలం ఏలూరి రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలని కోరారు.

# పెరుగుతున్న హింసాత్మక ఆలోచన



### -ఆందోళనకు గురి చేస్తున్న వరుస ఘటనలు
### -మత్తు, జల్సాలకు బానిసలవుతున్న యువత

**ప్రజాపక్షం/ఖమ్మం :** మారిన సామాజిక, ఆర్థిక పరిస్థితులు, సోషల్ మీడియా ప్రభావం ఇతరత్రా కారణాలతో యువతలో హింసాత్మక ధోరణి రోజు రోజుకు పెరుగుతుంది. జీవితంలో స్థిరపడకపోవడం, మత్తుకు, జల్సాలకు బానిసలుగా మారడం, ఖర్చుల కోసం తప్పుడు మార్గాలను ఎంచుకోవడం ఇప్పుడు తీవ్ర ఆందోళనకు దారి తీస్తుంది. కొందరిని మాట్లాడించాలంటేనే భయపడే పరిస్థితి నెలకొన్నది. కొందరు మానసిక వైద్యులు చెబుతున్నట్లుగా నిరంతరం ఫోన్, ఇతరత్రా ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకాలతో స్వీయ నియంత్రణను కోల్పోతున్నారన్న దానికి అనేక ఘటనలు ఊతమిస్తున్నాయి. కొండమల్లేపల్లిలోని ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి హత్య సమాజాన్ని ఉలికిపడేలా చేసింది. జల్సాలకు అలవాటు పడిన ఓ విద్యార్థినిని మందలించిందని మరో విద్యార్థితో కలిసి ఏకంగా ప్రిన్సిపాల్ రూపారెడ్డినే మట్టుపెట్టడం, వీరు 15 ఏళ్ల లోపు వారు కావడం గమనార్హం. ఆ వయస్సులోనే గంజాయి, సిగరెట్లు, మద్యానికి అలవాటు పడి ఈ దారుణానికి వడిగట్టినట్లు కూడా ప్రచారం జరుగుతుంది. ఒక వ్యక్తిని హత్య చేసిన తర్వాత కూడా కనీస పశ్చాత్తాపం లేకుండా వారు దొంగిలించిన నగదుతో జల్సాలు చేస్తున్నారంటే పరిస్థితికి ఏ స్థాయికి దిగజారిందో అవగతమవుతుంది. ఇటీవల ఖమ్మంలో జరిగిన ఓ హత్య కూడా స్వల్ప వివాదంతోనే జరిగింది. చెడు అలవాట్లతో బాధ్యతలను విస్మరించిన యువత చిన్న చిన్న విషయాలకే రెచ్చిపోతున్నారు. కుక్క మోటార్ సైకిల్‌పై ఉచ్చపోసిందని కుక్క యజమాని ఇంటిపై పడి దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఆ కుక్క యజమాని కూడా దారి తప్పినవాడే కావడంతో కత్తి తీసుకు వచ్చి వచ్చిన వారిలో ఒకరిపై దాడి చేసి ప్రాణాలు తీశాడు. ఒకరు దాడిలో ప్రాణాలు కోల్పోగా మరొకరు జైలుపాలయ్యాడు. గతంలో కేవలం మద్యం, సిగరెట్లే అనుకుంటే ఇప్పుడు గంజాయి మత్తు యువతను అవహిస్తుంది. నగరాలు, పట్టణాలను దాటి పల్లెలకు వ్యాపించింది. సాయంత్రం పూట పట్టణాలు, నగరాలలో బయటకు వెళితే ఎవరు ఎక్కడ ద్విచక్ర వాహనాలతో

మిగతా 2లో..

## నేడు ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ





### -హాజరుకానున్న కూనంనేని, బాగం
### -కోదుమూరులో యువజన ప్రదర్శన

**ప్రజాపక్షం/ఖమ్మం :** అఖిల భారత యువజన సమాఖ్య ఖమ్మం జిల్లా 25వ మహాసభలు చింతకాని మండలం కోదుమూరులో శుక్రవారం జరగనున్నాయి. అమరజీవి కా॥ పగడాల భరత్‌కుమార్ ప్రాంగణం (జ్యోతి ఫంక్షన్ హాల్)లో జరిగే ఈ మహాసభకు ఖమ్మంజిల్లాలోని 20 మండలాలు, ఖమ్మం కార్పోరేషన్‌తో పాటు వైరా, మధిర పట్టణాలకు సంబంధించి 750 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. మహాసభలను పురస్కరించుకుని గాజుల వెంకన్న స్తూపం నుండి మహాసభలు జరిగే జ్యోతి ఫంక్షన్ హాల్ వరకు ఉదయం 10 గంటలకు భారీ యువజన ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్,

మిగతా 2లో..

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి లక్ష్యం




### మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి చట్టం లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భూభారతి చట్టం తమ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజల తీర్పుకు రెఫరెండంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సత్తుపల్లి మండలం నారాయణపురంలో గురువారం నిర్వహించిన భూ రీ సర్వేపై రైతుల ముఖాముఖి, అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల భూ సమస్యలు, రీ సర్వేపై ఉన్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు.బేతుపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని మొత్తం 12,047 ఎకరాల్లో ఇప్పటికే సుమారు 6 వేల ఎకరాల రీ సర్వే పూర్తయిందని, మిగిలిన భూమికి కూడా త్వరలో సర్వే పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి భూమికి ఖచ్చితమైన కోఆర్డినేట్లు, మ్యాప్ రూపొందించి హక్కులను నమోదు చేస్తామని చెప్పారు. రీ సర్వే అనంతరం 30 రోజుల పాటు రైతుల అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించిన తర్వాతే తుది హక్కులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.వ్యవసాయ భూములకు వెళ్లే దారులను తప్పనిసరిగా పరిరక్షించాలని, వాటిని పట్టాదారు భూములుగా నమోదు చేయవద్దని అధికారులను ఆదేశించారు. చెరువుల హద్దులను కాపాడి, ఆక్రమణలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బేతుపల్లి పరిధిలో సుమారు 2,026 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా, అందులో సుమారు 980 ఎకరాలు పేదలకు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. అర్హులైన రైతుల భూ హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. నాగార్జునసాగర్ పైలట్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన సర్వేలో

మిగతా 2లో..

# పెరుగుతున్న హింసాత్మక ఆలోచన

**(మొదటిపేజీ తరువాయి)**
ఇబ్బందులు పెడతారోనన్న భయం కలుగుతుంది. విచ్చలవిడిగా మోటార్ సైకిళ్లు నడపడం, అడ్డు వచ్చిన వారిపై దాడులకు తెగబడటం చేస్తున్నారు. కొందరైతే ముఠాలుగా ఏర్పడి ఎక్కడ ఎవరు ఎవరి పైకి వచ్చినా వెంటనే అక్కడకు వాలిపోవడం, తీవ్ర స్థాయిలో ఘర్షణలు సృష్టించడం ఒక అలవాటుగా మారుతుంది. ఇటీవల కాలంలో రాజకీయ నాయకులు, వ్యాపారులు ఇటువంటి ముఠాలను వాడుకోవడం ప్రారంభించారు. కొందరైతే ఈ గ్యాంగులను పెంచిపోషిస్తున్నారు. వివాదాస్పద స్థలాలకు ఈ గ్యాంగులను రక్షణగా ఉంచడం, స్థలాలపైకి వచ్చిన వారిని భయపెట్టి దాడులకు పాల్పడటం అవసరమైతే ప్రాణాలు తీసేందుకు కూడా వెనకడటం లేదు. జల్సాలకు అలవాటు పడిన నగదు కోసం ఏమి చేసేందుకైనా వెనకడటం లేదు. కొందరు గంజాయి రవాణా చేయడం ఇప్పుడు అతి పెద్ద ఆదాయ వనరుగా ఎంచుకుంటున్నారు. కేసులు, శిక్షలు అనే విషయాన్ని మరిచిపోయి కేవలం నగదు కోసం గంజాయి రవాణా చేస్తూ విలువైన జీవితాలను పోగొట్టుకుంటున్నారు. మోటార్ సైకిల్‌పై గంజాయి రవాణా చేయడం ద్వారా అధిక మొత్తాన్ని గంజాయి వ్యాపారులు ఆఫర్ చేస్తుండడంతో యువత ఆ వైపు ఆకర్షితులవుతున్నారు. గంజాయి, మద్యం వీటితో పాటు ఇప్పుడు సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ ఆటలతో పెద్ద మొత్తంలో నష్టపోతున్నారు. మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లిదండ్రులను కుటుంబ సభ్యుల్లో ఎవరినో ఒకరిని హతమార్చడం కూడా జరుగుతుంది. ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువకుడు పబ్‌జీ తదితర ఆటలతో ఆర్థికంగా నష్టపోయి చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు. అతనిపైనే ఆశలు పెట్టుకున్న ఆ కుటుంబం పరిస్థితి ఇప్పుడు దయనీయంగా మారింది. దారితప్పిన యువత కుటుంబాలకు భారంగా మారుతున్నారు. మీ అబ్బాయి ఏమి చేస్తున్నాడు అని ఎవరైనా అడిగితే తలదించుకోవాల్సిన పరిస్థితిని సృష్టిస్తున్నారు. పోలీసులు, అధికార యంత్రాంగం తమ వంతు కృషి చేస్తున్న ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదు. కనీసం మైనార్టీ కూడా తీరని వారు సైతం ఈ మత్తు వలలో చిక్కుకుని చిత్తవుతుండటం ఆందోళనకు దారి తీస్తుంది. మొత్తంగా ఈ వ్యవహారంపై ఆలోచన జరగాల్సి ఉంది. నిరంతర శిక్షణ, అధ్యయన కేంద్రాలను ఏర్పాటు చేయాలి. అన్నింటికి మించి వారి వారి స్థాయిని బట్టి ఉపాధి కల్పించేందుకు పాలక వర్గాలు ప్రాధాన్యతనివ్వాలి. లేకపోతే దారి తప్పిన యువతను చూసి భయపడే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది కేవలం దారి తప్పిన వారి సమస్యగా కాకుండా సామాజిక సమస్యగా గుర్తించి మార్పుకు కృషి చేయాల్సి ఉంది.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి లక్ష్యం






**(మొదటిపేజీ తరువాయి)** సుమారు 3,400 నకిలీ పట్టాదారు పాస్‌బుక్‌లు గుర్తించినట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టామని, వచ్చే ఏడాదిన్నరలో వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయడమే లక్ష్యమని మంత్రి వెల్లడించారు. రైతుల భూ సమస్యలు లేని రాష్ట్రాన్ని నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.భూ ఆక్రమణదారులు అమాయక ప్రజలను అడ్డుపెట్టుకుని 22ఏ భూములను క్రమబద్ధీకరించుకునే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని మంత్రి స్పష్టం చేశారు. భూభారతి చట్టంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని కోరారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేసి రైతుల సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరిస్తుందని తెలిపారు. స్థానిక నాయకులు దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి ప్రాంతంలో రోజుకు 200300 ఎకరాల వరకు రీ సర్వే జరుగుతోందని, రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్‌రావు, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్, మున్సిపల్ చైర్మన్ రెహనా, వైస్ చైర్మన్ సుమలత, మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# వరి విత్తనాలు తీసుకున్న రైతులు ఆన్‌లైన్ చేయించుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోను వానాకాలం వరి పట సాగు చేసిన రైతులు ప్రభుత్వం నిర్ధారించిన 7 రకాల బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటి సోనా, డబ్ల్యూజిఎల్44(సిద్ధి), కెఎన్ఎం 1638, కెఎన్ఎం 7715 రకాలు సాగు చేసే రైతులు వారు తీసుకున్న విత్తనాల వివరాలను ఏ డీలర్ వద్ద అయితే విక్రయించారో వారి దగ్గర ఆన్‌లైన్ చేయించుకోవాలి. అదేవిధంగా వేరే ఇతర జిల్లాల నుండి తీసుకున్న విత్తనాలు, రైతు నుండి రైతు సేకరించిన విత్తనాలను, కౌలు రైతు తీసుకున్న విత్తనాలను రైతులు స్వీయ ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్ పుస్తకం ఆధార్ జిరాక్స్ తీసుకొని వెళ్లి సంబంధిత ఏఈవోల దగ్గర ఆన్‌లైన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ తెలియజేశారు. ఈ ఆన్‌లైన్ ప్రతిఒక్క రైతు తప్పక చేయించుకోవాలని,ఆగస్ట్30వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో హెచ్‌జిజి 385 రకం పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. 4 కేజీల బ్యాగు మొత్తం ధర రూ.544, సబ్సిడీ ధర రూ.240లు, రైతు చెల్లించవలసిన ధర రూ.3041లు ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్ పుస్తకం తీసుకొని సంబంధిత ఏఈవో దగ్గరకి వెళ్లగలరు. ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకోగలరని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# ప్రతి నీటి బొట్టును సంరక్షించాలి

**ప్రజాపక్షం/కామేపల్లి:** ప్రతి నీటి బొట్టును వృథా చేయకుండా సంరక్షించాలని డీఆర్‌డీఏ పీడీ కొండపల్లి శ్రీరామ్ సూచించారు. గురువారం రుక్కితండా గ్రామ పంచాయితీలో రైతుల పొలాల్లో ఫార్మ్ పౌండ్ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో ఫార్మ్‌పాండ్ల నిర్మాణంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించవచ్చన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ రమాదేవి, ఎంపీడీవో సోమ్లాల్, ఎంపీఓ వివిఎస్ శాస్త్రీ, ఏపీఓ శ్రీరాణి, ఈసీ దామాల వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శి ఎండి ఫజల్, టీఏ సుప్రియ, మెట్స్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన నిరుపేద పద్మశాలి ఆడెపు వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో అంత్యక్రియల నిమిత్తం ఖమ్మం జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో రూ.8వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. తెలంగాణ పద్మశాలి రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి చేతుల మీదుగా మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. గత పదిహేనేళ్లుగా సంఘం ఆధ్వర్యంలో నిరంతరం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆపదలో ఉన్న పద్మశాలి కుల బాంధవులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాస్‌బాబు, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పెండం జనార్ధన్, విశ్రాంత ఉద్యోగ విభాగం ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి కొండలరావు, యువ విభాగం అధ్యక్షుడు పులిపాటి సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చందా వీరభద్రం, నాయకులు మసనం సీతారాములు, పంతంగి అశోక్, వేణు, మోరం పాపారావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ

**(మొదటిపేజీ తరువాయి)**
సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్య క్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రి, కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ బాధ్యులు కొండపర్తి గోవిందరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి గౌస్‌పాషా, నానబాల రామకృష్ణ తదితరులు హాజరుకానున్నారు. వీరితో పాటు సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు , స్థానిక పార్టీ బాధ్యులు, ఆహ్వాన సంఘ బాధ్యులు హాజరుకానున్నట్లు ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి దూసరి గోపాలరావు తెలిపారు. మహాసభల్లో నేడు యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ఏఐవైఎఫ్ భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు వారు తెలిపారు. ఏర్పాట్లను పలువురు సిపిఐ నాయకులు, యువ జన విద్యార్థి సంఘాల బాధ్యులు పర్యవేక్షించారు. మహాసభలను పురస్కరించుకుని కోదుమూరు గ్రామాన్ని తోరణాలు, బ్యానర్లతో అలంకరించారు. మహాసభ ప్రాంగణంలో మహనీయుల చిత్ర పటాలను ఏర్పాటు చేయడంతో పాటు వారి సందేశాలను నేటి తరానికి తెలియజేసేవిధంగా తగు ఏర్పాట్లు పూర్తి చేశారు.

# నిత్యావసర వస్తువులు అందించండి

**-కమిషనర్‌కు ఏఐటియుసి వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు నిత్యావసర వస్తువులు అందించాలని ఏఐటియుసి ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామంజనేయులు విజ్ఞప్తి చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఖమ్మండిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించడం జరిగిందని ఈ ఆందోళనలో ప్రావిడెంట్ ఫండ్, ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. కార్మికులకు పిఎఫ్ స్లిప్పులు అందించాలని , శానిటేషన్ కార్మికులందరికీ మాస్కులు, గ్లౌసులు, ఇతర భద్రత పరికరాలు సమకూర్చాలని డిమాండ్ చేశామన్నారు.ఈ క్రమంలో మున్సిపల్ కార్మికులందరికీ నిత్యావసర వస్తువులు అందించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి కోరుతుందని రామాంజనేయులు తెలిపారు. వారానికి ఒక రోజు సెలవు, ఏడాదికి జాతీయ, పండుగ సెలవులను మంజూరు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మున్సిపల్ స్టాఫ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బుర్రి ఉపేందర్, నకిరికంటి కృష్ణ, నాయకులు ఇటికాల వెంకటేశ్వర్లు, మహేష్ పాల్గొన్నారు.

# రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/ఖమ్మం :** ఏఐకెఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గోపీనాథ్, తాళ్లూరి వేణు లు కోరారు. గురువారం టిఎన్‌జీవో ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సెప్టెంబరు 28, 29, 30 తేదీల్లో జరిగే మహాసభలకు 16 రాష్ట్రాల నుంచి 500 మంది రైతు కూలీ ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగ నిపుణులు, ప్రజాస్వామిక వాదులు తదితరులతో సెమినార్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 28న ఖమ్మంలో భారీ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. మీడియా సమావేశంలో స్పర్శ భాస్కర్, తిరుమల్, భిక్షపతి, మండలి వెంకన్న, విప్లవ్ కుమార్, బాబురావు పాల్గొన్నారు.

# సారలమ్మ గుడికి రోడ్డు, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించాలి

**జేఏసీ అధ్యక్షుడు గోగ్గల కృష్ణ**





**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల కేంద్రంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్నటువంటి సారలమ్మ గుడికి కనీస మౌలిక వసతులు లేక భక్తులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేఏసీ అధ్యక్షుడు గోగ్గల కృష్ణ అన్నారు. ప్రధాన రహదారి నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న సారలమ్మ ఆలయానికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో భక్తులు గుడికి ఎలా చేరుకోవాలో అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. సారలమ్మ ఆలయం కరకగూడెం మండలంలో భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోంది. వారానికి రెండు రోజులు ఆలయం తెరిచి ఉండగా, ఒక్కోసారి భక్తులు రద్దిగా ఉండడం వలన ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. అయితే ఆలయానికి సరైన రోడ్డు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ భక్తుల ఆవేదన పడుతున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి ప్రధాన రహదారి నుంచి సారలమ్మ గుడి వరకు రహదారిని నిర్మించడంతో పాటు ఆలయానికి విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని జేఏసీ అధ్యక్షుడు గోగ్గల కృష్ణ కోరారు. ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం ద్వారా వారి ఇబ్బందులను తొలగించాలని పూజారి పోలేపోయిన నరసయ్య కూడా కోరారు. అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పండ్ల మార్కెట్‌కు రూ.17.72 కోట్లు నిధులు మంజూరు




## -మంత్రి తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని ఖానాపురం ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ యార్డు అభివృద్ధికి రూ.17.72 కోట్లు నిధులు మంజూరు చేయించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పండ్ల వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఖానాపురం మార్కెట్ యార్డు వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు,కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అశ్రీఫ్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో నిలిచిపోయిన మార్కెట్ యార్డు పనులకు నిధులు మంజూరు చేయించారన్నారు. పండ్ల వ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి ఇబ్బందులను గుర్తించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్ అభివృద్ధికి రూ.17.72 కోట్లు నిధులు మంజూరు చేయించారన్నారు. మార్కెట్ యార్డు ప్రాంగణంలో సిసి ఫ్లోరింగ్, అంతర్గత రహదారుల అభివృద్ధి, కాంపౌండ్ వాల్, టవర్ లైట్లు, విద్యుద్దీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. వ్యాపారులు, రైతులు, వినియోగదారులకు అవసరమైన సౌకర్యాల కల్పన జరుగుతుందని తెలిపారు. పండ్ల వ్యాపారుల అసోసియేషన్ అధ్యక్షులు షేక్ జానిమియా, కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు గరగ శ్రీనివాస్ లు మాట్లాడుతూ పండ్ల విక్రయాలకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. యార్డు నిర్మాణం పూర్తయితే రహదారిపై పండ్ల వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలు తీరుతాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అసోసియేషన్ తరుపున మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు తుమ్మల యుగంధర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ, సహాయ కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, కోశాధికారి ఉస్మాన్, గౌరవ సలహాదారులు అన్నపు మల్లికార్జున్, ఖాసీం, కరీం తదితరులు పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల వ్యాధులకు అత్యాధునిక శస్త్ర చికిత్సలు

## -యశోద ఆసుపత్రి వైద్యులు రోహన్‌రెడ్డి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి భయపడాల్సిన అవసరం లేదని ప్రస్తుతం అత్యాధునీక శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రికి చెందిన థోరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఖమ్మం యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ రోహన్‌రెడ్డి థోరాసిక్ సర్జరీ అంటే కేవలం గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స కాదని గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలను కార్డియో థోరాసిక్ సర్జరీ అని పిలుస్తారన్నారు. ఊపిరితిత్తులు, ఛాతీ భాగానికి సంబంధించిన శస్త్ర చికిత్సలకు ప్రత్యేకంగా థోరాసిక్ సర్జరీ అనే విభాగం ఉందన్నారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత ఊపిరితిత్తుల వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ఊపిరితిత్తులకు సంబంధించిన అనేక సమస్యలకు ప్రస్తుతం ప్రత్యేక శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో పల్మనాలజీ, థోరాసిక్ సర్జరీ సేవలను 24 గంటలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్‌ప్లాంట్) సేవలు కూడా ప్రారంభించి విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం రోగులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారన్నారు. చివరి దశలో ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి కొత్త జీవితాన్ని అందించే అవకాశం ఉందన్నారు. ఇంటర్ స్టీషియల్ లంగ్ డిసీజెస్, ధూమపానం కారణంగా వచ్చే సివోపిడి వంటి వ్యాధుల్లో ఒక దశ తర్వాత ఊపిరితిత్తుల పనితీరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి రోగులకు శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. వారికి లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్షయ వ్యాధి కారణంగా ఊపిరితిత్తులు దెబ్బతినడం, రక్తం పడటం, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యలకు అధునీక పద్ధతుల్లో శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్న కోతలతోనే శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని రోగి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ సేవలను ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి సీనియర్ మేనేజర్ శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

# ఉద్యోగ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం




## -సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట గురువారం వై. విక్రం అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రాష్ట్రంలో రేవంత్ సర్కార్ యేటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉద్యోగ కల్పన అంటే రోడ్డుపై పకోడీలు అమ్మడం కూడా ఉద్యోగ కల్పనలో భాగమేనని చెప్పడం నిరుద్యోగ యువతపై వారికి ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థమవుతుందన్నారు. యూత్ డిక్లరేషన్ ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం యువత పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. పలు రాష్ట్రాల్లో యువత పోరాటాలు చూసైనా ప్రభుత్వాల తీరు మారాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాచర్ల భారతి, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, విద్యార్థి, యువజన నాయకులు పాల్గొన్నారు.

# రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

**ప్రజాపక్షం/మధిరః** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధి 82వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పారుపల్లి విజయ్‌కుమార్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు రాజీవ్‌గాంధి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోన ధనికుమార్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, సెక్రటరీ పులిబండ్ల చిట్టిబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాల వెంకటరమణ గుప్తా, పాటిబండ్ల సత్యంబాబు, కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, సర్పంచ్ బి.అంజన్‌బాబు, పట్టణ కాంగ్రెస్ నాయకులుపాల్గొన్నారు.



# మొక్కలు నాటి సంరక్షించుకోవాలి



**-ప్రజాపక్షం/రఘునాథపాలెం :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలని వేపకుంట్ల సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా తెలిపారు. గురువారం వేపకుంట్ల గ్రామంలో సర్పంచ్ రమాదేవి రాజా ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భాగంగా ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భావితరాల భవిష్యత్తుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామాన్ని పచ్చదనంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీలాల అశ్వని, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం




**-ప్రజాపక్షం/రఘునాథపాలెం :** గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని రఘునాథపాలెం మండల ప్రత్యేకాధికారి పురంధర్ తెలిపారు. గురువారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులతో, సర్పంచులతో కన్వర్జేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి పురంధర్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఎంపిడివో అశోక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మురళీధర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు గ్రామాల్లోని సమస్యలను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల కళాశాల ఆకస్మిక తనిఖీ




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** పట్టణంలోని గుడిపాడు రోడ్డులో ఉన్న తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.డి. ముజాహిద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులు, నిద్రించే గదులు, మరుగుదొడ్లు, వంటశాల, తాగునీటి ప్లాంట్‌తో పాటు కళాశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? ఆహారం నాణ్యత ఎలా ఉంది? తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన వసతులపై విద్యార్థుల నుంచి సంతృప్తికరమైన సమాధానాలు రావడంతో అధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకటరామయ్యకు సూచించారు. కళాశాలలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకువచ్చి నివేదిక అందించాలని ఆదేశించారు.

# గురుకులంలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల మరియు కళాశాలలో ఐదో ఐదోవ తరగతి ఆరో తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు భర్తీ కొరకు 22వ తేదీ ఉదయం కళాశాల ఆవరణలో 11 గంటల నుంచి నిర్వహించబడుతుందని కళా శాల ప్రిన్సిపాల్ కనకదుర్గ తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు తమ వెంట కులం, ఆదాయం, చదువు, సర్టిఫికెట్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రము, టెన్త్ ఇంటర్ పాసైన సర్టిఫికెట్లను తీసుకొని రావాలని వారే అర్హులని పేర్కొన్నారు.

# అభివృద్ధిపై సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని మండలపరిషత్ కార్యాలయంలో 43రోజులకు ఒకసారి నిర్వహించే మండల అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. గ్రామ పంచాయతీలలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించారు. ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను ప్రజలకు చేర్చడంతో పాటు 16వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనల మేరకు పారదర్శకంగా వినియోగించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, ఎంపిడీఓ రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎంఈఓ శ్రీనివాస్, ఏఓ ఉమానాగేష్, పశుశైద్యాధికారి అనంతు హరీష్, సర్పంచ్‌లు కళ్లేం జాన్‌రెడ్డి, కోటి శ్రీను, గుండు శ్రావణి శ్రీనివాస్, బానోత్ పాపనాయక్, చుండూరు సృజన, కార్యదర్శులు పాల్గొన్నారు.

# అధికారులు హాజరు కాకపోవడంపై అసంతృప్తి



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయ అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశంలో మండల ప్రత్యేక అధికారి మాధవి పాల్గొని పలు అంశాలపై సమీక్షించారు. మండలంలో నిర్వహించిన తొలి సమీక్ష సమావేశానికి కొంతమంది సర్పంచులు హాజరుకాకపోవడంపై ప్రత్యేక అధికారి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. గ్రామాల అభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు సంబంధించిన అంశాలపై సర్పంచులు, అధికారులకు మాధవి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీఓ రామకృష్ణ, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ప్రారంభం

**ప్రజాపక్షం వార్తకు స్పందన**




**ప్రజాపక్షం/కామేపల్లి:** గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలపై ప్రజాపక్షంలో ప్రచురితమైన "గ్రామాల్లో దోమల మోత" కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మండల వ్యాప్తంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు డ్రైనేజీలను శుభ్రం చేసి, చెత్తకుప్పలు, మురుగు గుంటలను తొలగించారు. బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహించారు. ఈ పనులను ఎంపీడీవో సోమ్లాల్, ఎంపీఓ వివి ఎస్ శాస్త్రీ పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## 27న ధర్నాను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ఏన్కూరు :** ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల టీజీ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీఎస్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఏన్కూరు, తిమ్మారావు పేట, బురద రాఘవాపురం కాంప్లెక్స్‌లలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఈహెచ్ఎస్‌ను సమర్థంగా అమలు చేయాలని, రెండో పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, జీవో 25ను సవరించాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 27న జిల్లా కేంద్రంలో ధర్నాలు, సెప్టెంబర్ 1న నల్లబ్యాడ్జీలతో నిరసన, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తిమ్మారావు పేట కాంప్లెక్స్ హెచ్ఎం రహీం బీ, ఏన్కూరు కాంప్లెక్స్ హెచ్ఎం వాసవి దేవి, బురద రాఘవాపురం హెచ్ఎం సుజాతతో పాటు ఉపాధ్యాయులు శ్రీదేవి, సింగ్య, రమేష్, శంకర్రావు, పుల్లయ్య, రామారావు, రాఘవరావు, బి నాగేశ్వరరావు, బి నరసింహారావు, రవిలాల్, వెంకట నరసయ్య, రవికిరణ్, సునీత, కుమారస్వామి, హీరాలాల్, భగవాన్‌దాస్, శశికళ, సోనాబాయి, వేణు, ఝాన్సీ, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## బాలల సదనం, పాఠశాల, పీహెచ్‌సీలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/మణుగూరు:** భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐఏఎస్ మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని బాలల సదనం, ఎంపియూపిఎస్ పాఠశాల, ప్రాథమిక ఆరో గ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలల సదనంలో విద్యార్థులతో మాట్లాడిన సబ్ కలెక్టర్ వారి యోగక్షేమాలు, వసతి, భోజనం, తాగునీరు, పరిశుభ్రతకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. బాలల సదనంలో అవసరమైన ఫ్యాన్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎలక్ట్రికల్ మరమ్మతులు చేపట్టాలని, డైనింగ్ ట్నింగ్, కుర్చీలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, తహశీల్దార్ అద్దంకి నరేష్‌ను ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న ఆహార మెనూను పరిశీలించిన సబ్ కలెక్టర్, వారి అభిరుచులకు అనుగుణంగా ఇష్టమైన ఆహారాన్ని సాయంత్రం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపియూపిఎస్ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అక్కడి సౌకర్యాలు, సేవలపై వివరాలు తెలుసుకున్నారు. తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, తహశీల్దార్ అద్దంకి నరేష్, బాలల సదనం వార్డెన్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రమదానం సమిష్టి భోజనం కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలతో కలిసి శ్రమదాన కార్యక్రమంలో డీఎంహెచ్వో తుకారం రాథోడ్ పాల్గొన్నారు. ఆసుపత్రి పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని ఏరివేశారు. ఆస్పత్రిలో అపరిశుభ్రత నెలకొనడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని కోరారు. ప్రజలు కూడా ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. ప్రతి నెల మూడో గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, బస్తీ దవాఖానాల్లో, రెండవ గురువారం ఆరోగ్య ఉప కేంద్రాలలో ఆశా కార్యకర్తలు శ్రమదానం సమిష్టి భోజనం కార్యక్రమాన్ని నిర్వహించి ఆసుపత్రి ల పరిసరాలు అన్నిటిని పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. గత ఎనిమిది నెలల నుంచి ఈ కార్యక్రమాన్ని భద్రాద్రి జిల్లాలో కొనసాగిస్తున్నామని అన్నారు. కార్యక్రమం అనంతరం సిబ్బంది అంతా కలిసి సమిష్టి భోజనం చేసి సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, ఆయుర్వేదిక్ డాక్టర్ రాజేందర్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# అనుమతి ఎనిమిది వరకు.. బోధన పది వరకు..!

**సీబీఎస్ఈ పేరుతో అధిక ఫీజుల వసూళ్లు**



**ప్రజాపక్షం/చింతకాని :** పాఠశాల నిర్వహణలో నిబంధనలకు పాతరేస్తున్నారనే ఆరోపణలు రామకృష్ణాపురంలోని శ్రీజ ఇంటర్నేషనల్ స్కూల్‌పై వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలకు ఎనిమిదో తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అంతేకాకుండా సీబీఎస్ఈ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అనుమతి లేకుండా పదోతరగతి ఎలా..?**

పాఠశాల స్థాయిని మించి తరగతులు నిర్వహించేందుకు సంబంధిత విద్యాశాఖ బోర్డు అనుమతి తప్పనిసరి. అయితే శ్రీజ ఇంటర్నేషనల్ స్కూల్‌కు ఎనిమిదో తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ పదోతరగతి వరకు విద్యార్థులను చేర్చుకుని తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది.

**సీబీఎస్ఈ పేరుతో అధిక ఫీజులు...**

పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లో సీబీఎస్ఈ, అంర్జాతీయ కరిక్యులం గురించి ప్రస్తావిస్తూ విద్యాకార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. అయితే పాఠశాలకు ఉన్న వాస్తవ గుర్తింపు, అనుయతులు, సీబీఎస్ఈ అనుబంధం వంటి అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. సీబీఎస్ఈ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపైనా అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**పది పరీక్షలు ఎలా..?**

ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థుల పరిస్థితి ఏమిటన్నదే తల్లిదండ్రులను వేధిస్తున్న ప్రధాన ప్రశ్న. పాఠశాలకు అనుమతులు రాకపోతే ఏ స్కూల్ పేరుమీద పరీక్షలు రాయిస్తారు. వార్షిక పరీక్షలకు సంబంధంచి ఇంటర్నల్ మార్కులు నమోదు ఎలా చేస్తారు. విద్యార్థుల భవిత ఏం కానున్నది అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

**తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం : ఎస్ రామారావు (మండల విద్యాశాఖాధికారి చింతకాని)**

శ్రీజ పాఠశాలకు ఎనిమిదో తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అదనపు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో పాఠశాలను తనిఖీ చేసి ఉల్లంఘనలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

# అధికారులపై సర్పంచుల ఆగ్రహం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం గురువారం ప్రత్యేక అధికారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై జరిగిన సమావేశంలో అధికారులపై సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు యూరియా ఫెర్టిలైజర్స్ యాప్ యాప్ తో అష్ట కష్టాలు పడుతున్నామని దీన్ని సవరించాలని సర్పంచులు వ్యవసాయ శాఖ అధికారిని ప్రశ్నించారు. అది కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మండలాన్ని యూనిట్గా తీసుకొని ఎరువులను పంపిణించాలని సర్పంచులు కోరారు. రఘునాథ్ గూడెంలో మిషన్ భగీరథ నీళ్లు పూర్తిస్థాయిలో అందట్లం లేదని పంచాయతీ కార్యదర్శి అధికారి శివాని మిషన్ భగీరథ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా వైద్యులు నవ్య కాంత్ తబస్సుమ్ మాట్లాడుతూ అన్ని వ్యాధులకు వైద్య ఉందని సలహాలు సూచనలకు వైద్యం కు అందుబాటులో మేము ఉన్నామంటూ సభలో వైద్యులు సమాధానమిచ్చారు. అదేవిధంగా వారంలో రెండు రోజులు తమ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మండలంలో ఆర్ఎంపీలు తమకు మించి వైద్యం చేస్తున్నారని అలాంటి వారిని అదుపులో ఉంచాలని కోరారు. వారు ప్రథమ చికిత్స కే పరిమితం కావాలని అధికారులను కోరారు. తమకమించు తమకు మించి వైద్యం చేస్తే సమాచారం అందియాలని వైద్యులు కోరారు. లింగాల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధనలో నాణ్యమైన బోధన ఉపాధ్యాయులు చేయడం లేదని వారిని మార్చాలని ప్రస్తుతం ఆ ఉపాధ్యాయులు మాకు వద్దు అని ఎంఈఓ పొదిల పద్మను లింగాల సర్పంచ్ వేము కృష్ణ నిలదీశారు. మండలంలో ప్రైవేటు పాఠశాలల ఫీజులు బాదుడు విషయంలో ఎంఈఓ జోక్యం చేసుకోవటం లేదంటూ ఫీజులు జాబితా ప్రైవేట్ పాఠశాలల్లో అదనంగా ఉన్నాయని వాటిని పాఠశాల జాబితాలో నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ప్రశ్నించారు. వాటిపై పర్యవేక్షించాలని కోరారు. గత 20 సంవత్సరాలుగా పెద్ద కోరుకొండిలో సొంత ఇంటిలో అంగన్వాడి కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని దానిని ఇంతవరకు ఎందుకు మార్చడం లేదంటూ ఐసిడిఎస్ సిడిపిఓ ను పెద్ద కోరుకొండి సర్పంచ్ నాగమణి ప్రశ్నించారు. వెంటనే స్పందిస్తూ వారం రోజుల్లో అంగన్వాడి కేంద్రాన్ని వేరే గృహానికి తరలిస్తామని వివరించారు. భూగర్భ జలాల పెంపుదలకు కల్లూరు లోని పలు గ్రామాలలో ఇంకుడు గుంటలు డ్రైనేజీ ఇంకుడు గుంటలు మంజూరయ్యాయని వాటిని నిర్మించాలని సర్పంచులను ఎంపీ ఓ సురేష్ బాబు కోరారు. మండలంలో సర్పంచులు అనుమతులు గృహ నిర్మాణాలు చేస్తున్నారని అది ఎలా సాధ్యమని సర్పంచులు జినుగు శ్రీనివాసరావు, వేము కృష్ణ, గోకారం శ్రీనివాసరావు, మర్లపాడు సర్పంచ్, చిన్న కృష్ణ పాయపూరు సర్పంచ్ శ్రీనివాసరావు లు గృహ నిర్మాణ శాఖ అధికారి పవన్ ను ప్రశ్నించారు. గతంలో ఇందిరమ్మ కమిటీ ద్వారా జరిగిందని ఇప్పుడు ప్రస్తుతం సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జీఓ ప్రకారం నిర్మించాలని అధికారులను డిమాండ్ చేశారు. అదేవిధంగా నీటిపారుదల శాఖ అధికారి హార్దికను ప్రశ్నిస్తూ పంటలకు సాగు నీరు ఇచ్చి పంటలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సర్వసభ్య సమావేశం మొదటిసారిగా జరిగిన సమావేశం వాడి వేడిగా జరిగింది. ఈ సమావేశం సుమన్ చక్రవర్తి ప్రత్యేక అధికారి అధ్యక్షతన ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బ్రహ్మేశ్వరరావు, సిడిపిఓ నిర్మల జ్యోతి, ఎంఈఓ పొదిలా పద్మ, మిషన్ భగీరథ అధికారి శివాని, ఆర్టీసీ గ్రామీణ బస్సు అధికారి కిన్నెర ఆనందరావు, వ్యవసాయ శాఖ అధికారిని రూప, ఎస్సీ బిసి సంక్షేమ అధికారులు పలు శాఖల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిపక్ష సర్పంచులు సమస్యలపై అధికారులను నిగ్గదీశారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**వైరా శాసన సభ్యులు రాందాస్ నాయక్**



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం అని వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా జూలూరుపాడు మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ముఖ్యంగా యువతకు రాజకీయ, సామాజిక రంగాల్లో సముచిత ప్రాధాన్యత కల్పించేందుకు కృషి చేసిన అంశాలను గుర్తు చేశారు. అంతే కాకుండా దేశాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన దూరదృష్టితో చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నిరంతరం శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జీతాల్లేక ఐదు నెలలుగా కంప్యూటర్ ఆపరేటర్ల అవస్థలు..!

**-జీతాలు తగ్గించి...చెల్లింపులు నిలిపివేత**
**-ఈఎంఐలు కట్టలేక ఇబ్బందిపడుతున్నామంటున్న ఆపరేటర్లు**



**ప్రజాపక్షం/ఖమ్మం:** ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలో మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 68 మంది కంప్యూటర్ ఆపరేటర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 11 ఏళ్లుగా మండల పరిషత్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ...ప్రస్తుతం ఐదు నెలలుగా జీతాలు అందక కుటుంబాలను పోషించుకునేందుకు నానా అవస్థలు పడుతన్నారు. 2015 సంవత్సరంలో రూ.5700లు జీతంతో విధుల్లో చేరిన కంప్యూటర్ ఆపరేటర్ల వేతనం క్రమంగా పెరిగి రూ.22750లకు చేరింది. అయితే ఇటీవల వారి వేతనంలో రూ.3250లు కోత విధించడంతో ప్రస్తుతం రూ.19500లు మత్రమే చెల్లిస్తున్నట్లు ఆపరేటర్లు చెబుతున్నారు. తక్కువ వేతనంతోనే ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు ఇప్పుడు ఐదు నెలలుగా జీతాలు కూడా రాకపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వేతనాలు పెంచాలని కోరుతూ కంప్యూటర్ ఆపరేటర్లు ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో దీక్షలు కూడా చేపట్టారు. అప్పట్లో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించినప్పటికీ ప్రస్తుతం వేతనం తగ్గడంతో పాటు నెలలు తరబడి జీతాలు చెల్లించకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తుందని అంటున్నారు.

**ఈఎంఐలు...పిల్లల చదువులు...కుటుంబ పోషణ**

నెలవారి జీతాన్ని నమ్ముకొని బ్యాంకు రుణాలు, ఈఎంఐలు తీసుకున్న పలువురు ఆపరేటర్లు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈఎంఐలు సకాలంలో చెల్లించకపోవంతో బ్యాంకుల నుంచి పదేపదే ఫోన్ కాల్స్ వస్తున్నాయని, కొందరి క్రెడిట్ స్కోర్ కూడా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల చదువుల ఫీజులు, ఇంటి అద్దె, నిత్యవసరాలు, వైద్య ఖర్చులు తదితరాలను కూడా సర్దుబాటు చేసుకోలేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెబుతున్నారు.

**జీతాలు ఎందుకు నిలిచాయి?**

అసలు కంప్యూటర్ ఆపరేటర్ల జీతాలు ఐదు నెలలుగా ఎందుకు నిలిచిపోయాయి? గతంలో రూ.22750గా ఉన్న వేతనాన్ని రూ.19500కు ఎందుకు తగ్గించారు? వేతన కోతకు కారణాలేమిటి? అనే విషయాలపై స్పష్టత లేకపోవడంతో ఆపరేటర్లలో అయోమయం నెలకొంది. తమ సమస్యలను అధికారులు పట్టించుకోవాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సంబంధిత రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి ఐదు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు వేతన కోతకు కారణాలను వెల్లడిచంఆలని కంప్యూటర్ ఆపరేటర్లు కోరుతున్నారు. చాలిచాలని జీతాలతో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న తమ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మహనీయుడు రాజీవ్ గాంధీ : పాయం



**ప్రజాపక్షం/మణుగూరు:** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను గురువారం మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ఆధునిక భారత నిర్మాణం కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు సాంకేతిక రంగంలో భారత దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు ఓటు హక్కు కల్పించడం, సమాచార సాంకేతిక రంగానికి పునాదులు వేయడం వంటి కీలక నిర్ణయాలు రాజీవ్ గాంధీ దూరదృష్టికి నిదర్శనమని అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, 14 టైర్ యూనియన్ నాయకులు, 12 టైర్ యూనియన్ నాయకులు, గుమస్తాల సంఘం నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులర్పించారు.

# 24న జరిగే ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈ నెల 24న జరిగే ఆటోల బంద్‌ను జయప్రథం చేయాలని ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య అన్నారు. గురువారం స్థానిక శేషగిరి భవన్ సిపిఐ కార్యాలయంలో ఆటో వర్కర్స్ జిల్లా సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నది ఆర్టిసి తర్వాత ఆటోలే అని చెప్పారు. లక్షలాది మంది ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తూ తెలంగామ రాష్ట్రంలో ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంతగా ఉపాది కోసం అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి అనేక మంది ప్రజలకు రవాణా సదుపాయాన్ని కల్పిస్తూ కుటుంబాలని పోషించుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని కార్మిక సంఘాలతో వివిధ సమస్యలపై సమావేశం కావడం జరిగిందని తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12000 ఇస్తామనే హామీని ఇచ్చారని, కానీ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేన్నరేళ్లు ఉవుతున్నా ఆ హామీ నెరవేర్చలేదన్నారు. ప్రక్క రాష్ట్రం ఏపిలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12వేలు ఇస్తున్నారని, ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరో కార్మిక సంఘాలను పిలిపించి చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అబ్బులు దేశీ ఆర్యకృష్ణ బడుగు భాస్కర్ బాబు జానీ వెంకట్ గాబ్రేలు గౌస్ సత్యనారాయణ విజ్జి కిరణ్ ముక్కెర లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ దరఖాస్తులను సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేయండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఫించన్ కోసం వచ్చిన దరఖాస్తు లను వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. వివిధ పంచాయతీల నుంచి వచ్చిన దరఖాస్తుల పై పంచాయతీ కార్యదర్శుల తో చాంబర్లో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలం లోని ఆయా గ్రామాల నుంచి వచ్చే. ప్రతీ దరఖాస్తు ను వెంటనే ఆన్లైన్ చేయించాలని సూచించారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. ఫించన్ ల కోసం దరఖాస్తు లు చేసుకోవాలని ప్రజలకు వివరించాలని సూచించారు. ఆన్లైన్ నమోదు లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ నెల చివర వరకు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలను అప్రమతం చేయాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రేగా కాంతారావుపై కేసు కొట్టివేత

**-బీఆర్ఎస్ శ్రేణుల హర్షం**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** పినపాక మాజీ ఎంఎల్ఏ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావుపై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ఆళ్లపల్లి, మార్కోడు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాయం నరసింహారావు, మండల కార్యదర్శి షేక్ బాబా, నియోజకవర్గ యువజన కార్యదర్శి, ఆళ్లపల్లి ఉప సర్పంచ్ సయ్యద్ ఆరిఫ్ మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే రేగా కాంతారావుపై కేసు నమోదు చేశారని ఆరోపించారు. కేసులో ఆధారాలు లేవని హైకోర్టు కొట్టివేయడం కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు వంటిదని వ్యాఖ్యానించారు. రేగా కాంతారావుకు ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి కొందరు అసత్య ప్రచారం చేశారని విమర్శించారు. ఈకార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కొమరం హనుమంతరావు, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు కొమరం వెంకన్న, సర్పంచ్ రుక్మిణి, వార్డు సభ్యులు తాళ్లపల్లి ఎల్లగౌడ్, కొమరం వెంకటకృష్ణరాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వేమూరి రాంబాబు, మండల కార్యదర్శులు మహమ్మద్ ఖయ్యూం, వేమూరి సత్యం, తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను గురువారం చంద్రుగొండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు రమణ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నల్లమోతు రమణ మాట్లాడుతూ దేశ సేవకు జీవితాన్ని అంకితం చేసిన రాజీవ్‌గాంధీ పేదల సంక్షేమానికి అనేక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. భారత ఐటీ, సమాచార, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ఆయన పునాదులు వేశారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానీయుడు రాజీవ్ గాంధీ



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మాజీ ప్రధాని, భారతరత్న దివంగత రాజీవ్ గాంధీ దేశ అభివృద్ధికి విశేష కృషి చేసిన మహానీయుడని ఏన్కూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుగులోత్ లచ్చిరాం నాయక్ అన్నారు. గురువారం ఏన్కూరు ప్రధాన కూడలిలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. సాంకేతిక రంగంలో దేశ పురోగతికి ఆయన పునాదులు వేశారని కొనియాడారు. యువత, యువ నాయకులు రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కొప్పుల ప్రభావతిరెడ్డి, తంబళ్ల సామేలు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ భూక్య లాలూ నాయక్, చందమామ నరసింహారావు, పటాన్ మజీద్ ఖాన్, వర శంకర్ ప్రసాద్, కనిశెట్టి వెంకన్న, వాసిరెడ్డి సత్యనారాయణ, భూపతి వెంకటేష్, అజ్మీర సురేష్, అత్తులూరి కోటచారి, దుద్దుకూరి భాస్కరరావు, బందె ప్రకాష్ పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

**మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరవలేనివని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం లో గురువారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక మరియు సాంకేతిక వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. దేశ ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని అన్నారు. ఆయన లేని లోటు దేశానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు రాయపూడి నవీన్, యం.వెంకన్న, నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, పొన్నగాని రాంభాస్కర్, కోడిరెక్క వినోద్, లక్కం ఏడుకొండలు, అనంతు సత్యనారాయణ, పాకనాటి కన్నారెడ్డి, చెరుకుపల్లి రాజేష్, కడియాల నరేష్, సీ.హెచ్. వెంకటేష్, రంగయ్య, కాశిబోయిన మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి





**-వివిపాలెంలో ఎస్ఐఆర్ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్**

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నో మ్యాపింగ్, అనమాలీస్ ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి తదుపరి ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టివిస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం నియోజక వర్గం రఘునాథపాలెం మండలంలోని వి. వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్‌లో భాగంగా నో మ్యాపింగ్, అనమాలీస్ ఓటర్ల పరిష్కార ప్రక్రియను కలెక్టర్ దివాకర టివిస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నోటీసులు అందుకున్న ఓటర్లతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నోటీసుల జారీకి సంబంధించిన రికార్డులను ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న ధృవపత్రాలను పరిశీలించి ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌లో ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కానీ ఓటర్ల గుర్తింపు, ఓటరు వివరాల్లో వ్యత్యాసాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నోటీసు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువు సమయంలో హాజరై తమ పౌర సత్వాన్ని నిర్ధారించే సంబంధిత ధృవపత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధృవపత్రాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు అక్టోబర్ 15 వరకు వాటిని పరిష్కరించాలన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సహాయాన్ని అందిస్తూ ప్రతి కేసును నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, కలెక్టరేట్ ఎన్నికల విభాగ డిటి అన్సారీ, సర్పంచ్ కాపా ఆదినారాయణ, బిఎల్‌వోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి.. జీవో నెం. 97ను రద్దు చేయాలి




**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో వినియోగం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, జీవో నెం.97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌజ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అన్నారు. దీనిని శక్తి శాఖలో కలపడం వల్ల పాలిటెక్నిక్ విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలలు ప్రైవేటుపరమైతే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లోమా విద్య అందకుండపోతుంద న్నారు. పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను దూరం చేసే కుట్రలకు ప్రభుత్వం పూనుకుంటుందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వం ప్రైవేటీకరణ దిశగా ఆలోచన చేయడం సరికాదని తక్షణమే దానిని విరమించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో నెం. 97ను ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగులమీరా, బుర్రా మనోజ్, చెన్నంశెట్టి ఆకాష్, నరేందర్, పవన్, శశి,వెంకట్, నరేష్, గోవర్ధన్, మహేందర్, వెంకీ పాల్గొన్నారు.

# బురదమయంగా మారిన కెవిసిఎం రోడ్డు..!



**-రోడ్డుపై నాట్లు వేసి ప్రజల నిరసన**
**-నెలలు గడిచినా పనులు ప్రారంభం కాలేదని ఆగ్రహం**

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని కెవిసిఎం రోడ్డు అధ్వానంగా మారి బురద మడుగును తలపిస్తుంది. వర్షం పడిన ప్రతి సారి రోడ్డుపై నీరు నిలిచి బురదయమంగా మారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదచారులు నడవడానికి వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు దుస్థితిపై నిరసనగా సిపిఎం పిఎస్2 శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రజలు రోడ్డుపైనే నాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. బురదలో కూర్చొని తమ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ కెవిసిఎం రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే2026 జనవరి 4న శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు. శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాంలో రోడ్డుపై నీరు నిలిచి బురదగా మారడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో సమస్య మరింత తీవ్ర మవుతుందని పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కెవిసిఎం రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ నాయకులు గుడిమెట్ల మోహన్‌రావు, కొంగర సుధాకర్, షేక్ నాగుల్ పాషా, మాడపాటి మల్లికార్జరనావు, మాడపాటి వెంకటేశ్వరరావు, రేచర్ల సైదులు, రామిని శ్రీనివాసరావు, రామిని ప్రశాంత్, బాడిస రమణయ్య, బాడిస రవి, తోట రాకేష్, తోట మంజుల, రాయల తిరపమ్మ, మణి తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరగాలి



**ప్రజాపక్షం/కల్లూరు:** సాధారణ ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలోనే పూర్తిస్థాయిలో జరగాలని జిల్లా వైద్యాధికారి రామారావు అధికారులకు సూచించారు. కల్లూరు మండల పరిధిలోని గర్భిణీ స్త్రీలు అందరూ ప్రభుత్వాసుపత్రిలోనే సాధారణ కార్పొరేషన్ కాన్పులు చేయించుకోవాలని ఆ విధంగా వైద్యులు ఆశా ఆరోగ్య కార్యకర్తలు సహకరించాలని కోరారు. కల్లూరు లోని ప్రభుత్వ వైద్యశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన చేశారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు నిర్వహించారు. వైద్యులు ఆసుపత్రి పని సమయంలో రోగులతో సమన్వయంగా ఉంటూ సేవలను అందించాలని కోరారు. అదే విధంగా గ్రామాలలోజ్వరం సర్వే, వ్యాధులు సీజనల్ వ్యాధులపై గ్రామాలలో సదస్సులు నిర్వహించి పలు సలహాలు సూచనలు పేదలకు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నవ్య కాంత్, ఆరోగ్య వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రూ.1.83 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీకారం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ప్రజారోగ్యం, విద్యారంగాల బలోపే తానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ.1.83 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టా రు. ఎన్టీఆర్ నగర్‌లో రూ.1.43 కోట్లతో నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. అవసరమైన వైద్యాధికారులు, సిబ్బంది నియామ కానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. శివసాయి నగర్‌లో రూ.40 లక్షలతో నిర్మించనున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఎంహెచ్‌వో డా. రామారావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన విద్యార్థులకు బయోజెమ్ ప్రగతి స్కాలర్‌షిప్స్



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని వల్లభి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరంలో 9వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి, ప్రస్తుతం పదో తరగతిలో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు గురువారం బయోజెమ్ ప్రగతి స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ప్రతీ విద్యార్థికి రూ.3వేలు చొప్పున స్కాలర్‌షిప్‌ను బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు, పూజిత ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు మన్నెం గోపాల్‌రావు సహకారంతో అందజేశారు. పాఠశాలలోని 41మంది విద్యార్థులకు పూజిత ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో మన్నెం గోపాల్‌రావు పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బయోస్టాడ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ప్రతినిధి టీఎం రాఘవేంద్రరావు, వల్లభి గ్రామ మాజీ సర్పంచి పోట్ల వెంకట ప్రసాద్, పూజిత ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు మన్నెం గోపాలరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రియదర్శినిలో ప్రారంభమైన సిఆర్‌టి ఓరియంటేషన్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ప్రియదర్శిని(అటానమస్) మహిళా ఇంజినీరంగ్ కళాశాలలో సిఆర్‌టి ఓరియంటేషన్ శిక్షణ గురువారం ఘనంగా ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థునులకు టిసిఎస్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను సాధన నైపుణ్యంపై మైయాక్స్ స్కిల్స్ ల్యాబ్ సంస్థ కార్యనిర్వహణాధికారి ఏం మహేష్ తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ బి,గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, మైయాక్స్ స్కిల్స్ ల్యాబ్ సంస్థ ప్రతినిధులు ఆర్ శ్రీధర్, సిహెచ్ ప్రవీణ్‌కుమార్, వి. సురేష్, కళాశాల విభాగాధిపతులు, బోధనా సిబ్బంది, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తివారిమన్మోహన్ పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో నాగేశ్వరరావుకు రెండు అవార్డులు



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్రస్థాయి ఫొటోగ్రాఫి పోటీల్లో వైరాకు చెందిన ఫొటోగ్రాఫర్ ముత్యాల నాగేశ్వరరావు ప్రతిభ చాటారు. ఖమ్మం జమ్మికుంటలో జరిగిన రెండు వేర్వేరు పోటీల్లో ఆయనకు రెండు అవార్డులు, నగదు బహుమతులు లభించాయి. అంతర్జాతీయ ఫొటోగ్రాఫి దినోత్సవం సందర్భంగా హెడ్‌కె. ఆర్ట్ ఫొటోగ్రాఫి, ఖమ్మం జిల్లా ఫొటోగ్రాఫి అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఫొటోగ్రాఫర్లతో నిర్వహించిన పోటీల్లో నాగేశ్వరరావు వైల్డ్‌లైఫ్ విభాగంలో ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ పోటీల్లో రెండు రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా ఫొటోగ్రాఫర్లు పాల్గొనగా, నాగేశ్వరరావు తీసిన ఫొటోకు అవార్డు దక్కడం విశేషం. ఖమ్మంలోని టిఎన్‌జివోఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో అడిషనల్ డిసిపి అడ్మినిస్ట్రేషన్ బొజ్జా రామానుజం చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. అలాగే కరీంనగర్ జిల్లా జమ్మి కుంటలో జరిగిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రాఫి పోటీల్లో తెలంగాణ కల్చర్ విభాగంలో నాగేశ్వరరావుకు బెస్ట్ కన్సొలేషన్ అవార్డుత పాటు నగదు బహుమతి లభించింది. జమ్మికుంట అసోసియేషన్ ముస్తఫా, ఆర్ట్ ఫొటోగ్రాఫి మెంబర్స్ అనిల్ కుమార్ దేశ్‌పాండే, శివకుమార్ డాక్టర్ నాగరాజు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. గతంలోను నాగేశ్వరరావు జాతీయ, రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. తాజాగా రెండు రాష్ట్రస్థాయి అవార్డులు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు సాధించడమే తన లక్ష్యమని తెలిపారు. నాగేశ్వరరావుకు అవార్డులు రావడం పట్ల జిల్లా ఫొటోగ్రాఫర్లు, జిఎంపివిడబ్ల్యూఏ యూనియన్ సభ్యులు, కళాభిమానులు అభినందనలు తెలిపారు.

# వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మినీ జాబ్‌మేళా

**-25 మందికి ఉద్యోగాలు**
**-ప్రతి నెల నియోజకవర్గంలో జాబ్ మేళా : ఎమ్మెల్యే**






**ప్రజాపక్షం/వైరా:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో మినీ జాబ్‌మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ జాబ్‌మేళాను ప్రారంభించారు. సుమారు 8 ప్రముఖ కంపెనీలు ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు రాగా, దాదాపు 100 మంది అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఇందులో 25 మందికి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు లభించగా, మరో 50 మందిని రెండో దశ ఇంటర్వ్యూకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో జాబ్‌మేళా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతినెల మొదటి మూడు వారాల్లో నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు స్వీకరించి, నాల్గో వారంలో మండల కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మహిళా కాంగ్రేస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కాంగ్రేస్ మండల, పట్టణ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కాంగ్రస్ మండల, పట్టణ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కిసాన్ కాంగ్రేస్ రాష్ట్ర నాయకులు దాసరి దానియేలు, సూరంపల్లి రామారావు, పమ్మి అశోక్, జవ్వాజి నాగరాజు, మాలోతు విగ్నేష్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులు విద్యార్థుల గొంతులు నొక్కడం సరైంది కాదు

**- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సాక్షాత్తూ పోలీస్ సిఐ, ఎస్ఐలు విద్యార్థుల గొంతులు నొక్కడం సరైంది కాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కే షాహిద్, వర్క అజిత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ మహబూబాబాద్ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం ఆ జిల్లా కలెక్టరేట్ ముందు శాంతియుతంగా ఆందోళన చేస్తున్న క్రమంలో పోలీసులు వారిని అడ్డుకుని గొంతులు నొక్కుతూ తోసేయడం హేయమైన చర్య అన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులను యంగ్ ఇండియా యూనివర్సిటీలో అనుసంధానం చేయరాదని, శక్తి స్కీమ్ రద్దు చేయాలని, జిఓనెం. 97ను వెనక్కు తీసుకోవాలని కలెక్టరేట్ ముట్టడి చేస్తుండగా పోలీసులు విచక్షణ కోల్పోయిన విద్యార్థులను గొంతులు పట్టి నొక్కడం ఎంటని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో చదువులు సాగించి ఉద్యోగాలు వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యావ్యవస్థను కాపాడుకునేందుకు పోరాడుతున్న విద్యార్థులపై ఇలాంటి చర్యలకు పూనుకోవడం ఏంటన్నారు. నిర్వీర్యమైపోతున్న ప్రభు త్వ విద్యను కాపాడుకునే హక్కు విద్యార్థులకు ఉందని, ఆ హక్కును హరించే విధంగా పోలీసుల తీరుందని మండిపడ్డారు. ఇప్పటికైనా విద్యార్థుల న్యాయమైన పోరాటాన్ని ప్రభుత్వం గమనించి పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే పనులను మానుకోవాలని, విద్యార్థులపై అనుచితంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

**వైరా శాసన సభ్యులు రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధి జయంతి సందర్భంగా వైరా రింగు రోడ్డు సెంటర్‌లోని రాజీవ్‌గాంధి విగ్రహానికి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో ఐటి విప్లవానికి శ్రీకారం చుట్టిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్‌గాంధి అని అన్నారు. ఆధునిక భారత నిర్మాణానికి పునాదులు వేసిన మహానేతగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, యువత భవిష్యత్తు కోసం రాజీవ్ గాంధి చేసిన కృషి ఎప్పటికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిపిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, హిళా కాంగ్రేస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కాంగ్రేస్ మండల , పట్టణ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కౌన్సిలర్లు ఫణితి సైదులు, మోర్ శ్రీకాంత్, కిసాన్ కాంగ్రేస్ రాష్ట్ర నాయకులు దాసరి దానియేలు, వేముల రత్నాకర్, సూరంపల్లి రామారావు, దార్న రాజశేఖర్, పమ్మి అశోక్, మిట్టపల్లి నాగి, వైరా నియోజకవర్గ యువజన కాంగ్రేస్ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్, జవ్వాజి నాగరాజు, మాలోతు విఘ్నేష్, అన్వర్, పల్లపు కొండలు, ఆది ఆనందరావు, పాలేటి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# జ్వరాలతో వణుకుతున్న కామేపల్లి..!

**-గ్రామాల్లో కానరాని వైద్య శిబిరాలు**
**-ప్రైవేటు వైద్యాన్నే ఆశ్రయిస్తున్న ప్రజలు**




**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండలంలో జ్వరాలు, అనారోగ్య సమస్యలు పెరుగుతున్నా ప్రభుత్వ వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నప్పటికీ వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడం, అవగాహన కల్పించడం కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇదే అదునుగా కొందరు ఆర్ఎంపీలు అధికంగా వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మరో వైపు కొందరు ప్రభుత్వ వైద్య సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉండకుండా పట్టణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరిస్థితిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్‌లో మరోసారి బహిర్గతమైన వర్గ విభేదాలు

**-పోటాపోటీగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు**





**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. గురువారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్‌లోని వేర్వేరు వర్గాలు పోటాపోటీగా నిర్వహించడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఒకవైపు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు ఆధ్వర్యంలో, మరో వైపు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గింజల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మరో రెండు వర్గాలు సైతం ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపట్టినట్లు సమాచారం. ఒకే పార్టీకి చెందిన నాయకులు వేర్వురుగా జయంతి కార్యక్రమాలు నిర్వహించడంతో మండల కాంగ్రెస్ నెలకొన్న అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, సర్పంచ్ సుస్మిత ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వాసం శ్రీకాంత్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన కృషి, ఆయన ఆలోచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీనాథ్, మహిళా నాయకులు పానుగంటి మంగ, పద్మ, మండల నాయకులు తులం ముత్తిలింగం, బూరుగడ్డ నాగేష్, తులం శ్రీనివాస్‌రెడ్డి, మల్లరాజు, భద్రయ్య, ప్రతాప్, ఒల్లోజు భరత్, తదితరులు పాల్గొన్నారు.

## భద్రగిరి మార్ట్ వస్తువులు ఆన్‌లైన్ సరఫరాకు సహకరించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రగిరి మార్ట్ ఆన్‌లైన్ ఆర్డానికి వస్తువులు ఆన్‌లైన్ ద్వారా వినియోగదారులకు అందించేందుకు కొరియర్ సర్వీస్ అధికారులు తోడ్పాటు అందించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సూచించారు. ఈ మేరకు గురువారం ఐటిడిఏ సమావేశ మందిరంలో కొరియర్ సర్వీస్ నిర్వాహకులు పోస్టల్ కార్గో సర్వీస్ వారిచే ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. చాలా మంది ఆన్లైన్ ద్వారా తమ గ్రామాలకు వస్తువులు పంపాలని కోరుతున్నందున వినియోగదారుల ఇళ్లకు చేరే విధంగా అయ్యే చార్జీలు తదితరాల వివరాలు సోమవారం నాటికి ఇవ్వాలన్నారు. తెలంగాణతో ఆటు ఆంధ్రప్రదేశ్‌కు వస్తువులు సకాలంలో భద్రంగా చేరే విధంగా సహకారం అందించి భద్రగిరి మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ ఏపిఓ పవర్ వేణు ఏఓ సున్నం రాంబాబు జిసిసి మేనేజర్ జయరాజ్ ఐటిడిఏ మేనేజర్ ఆదినారాయణ, వివిద కొరియర సర్వీసులకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



**ప్రజాపక్షం/కరకగూడెం:** సాంకేతిక భారతానికి పునాదులు వేసిన మహానేత రాజీవ్ గాంధీ అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. కరకగూడెం మండల కేంద్రంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కరకగూడెం మండల కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ రాజీవ్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారతదేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు నడిపించిన దూరదృష్టి కలిగిన నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ఎర్ర సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగబండి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ నాయకులు తోలెం నాగేశ్వరరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు చౌలం కేశవరావు, ఉపాధ్యక్షులు కల్తీ విజయ్, సర్పంచులు పోలేబోయిన సుజాత, తోలెం సావిత్రి, ఎర్రం పొట్టయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు జాడి శ్రీను, సీనియర్ నాయకులు నేతాజీ, మండల నాయకులు చందా నాగేశ్వరరావు,గొగ్గలి రవి, భూక్య రాందాస్, వెంకన్న, నాగేష్, శంకరయ్య, కృష్ణ, మహిళా నాయకులు రత్నమ్మ, శ్యాం కుమారి, ఉప సర్పంచ్ వెంకన్న, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## ఆక్రమిత ప్రభుత్వ భూములపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం పట్టణంలో ప్రభుత్వ భూములను ఇష్టాను సారంగా ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సామాజిక కార్యకర్త పూనెం ప్రదీప్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంత కాలంగా కొందరు ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకుల అనుచరులు ప్రభుత్వ భూములను ఇష్టాను సారంగా అక్రమించుకుంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారన్నారు. గిరిజన నాయకులు సోందె వీరయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల దోరణి మార్చుకోకుంటే మరోసారి పోరాటం చేస్తామని హచ్చరించారు. అనంతరం మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పాల్‌రాజ్, సామాజిక ఉద్యమకారుడు అలవాల రాజా మాట్లాడుతూ కబ్జాకు గురైన భూములను సేకరించి నిరుపేదలకు పంచాలని, ప్రభుత్వభూములను పరిరక్షించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

# పిపిది కుట్ర పూరిత వైఖరి




**-మాస్‌లైన్‌ను దెబ్బతీసే ప్రయత్నంలోనే ఆరోపణలు**
**-ప్రజా ఉద్యమాలలో పోటీపడదాం**
**-మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎన్డి నేత ప్రసాద్ (పి.పి)ది కుట్ర పూరిత వైఖరి అని మాస్‌లైన్‌ను దెబ్బతీసే క్రమంలోనే విద్వేషపూరితంగా వ్యవహరిస్తున్నారని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. మాస్‌లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ రాయల చంద్రశేఖర్ ఆత్మహత్య తర్వాత మాస్‌లైన్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు , బలహీనపరిచేందుకు న్యూడెమోక్రసీ నాయకత్వం పనిచేస్తుందని ఆయన ఆరోపించారు. గురువారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన మీడియా సమావేశంలో రంగారావు మాట్లాడుతూ చంద్రశేఖర్ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆయన మరణానంతరం దీనిపై విస్తృతంగా పార్టీలో చర్చ సాగిందన్నారు. సున్నితత్వంతో ఉద్రేకపడి ఆ నిర్ణయం తీసుకున్నాడని పార్టీ అభిప్రాయపడిందన్నారు. ఇది రాజకీయంగా, నైతికంగా, నిర్మాణ పరంగా పార్టీని నష్టం తెచ్చిందన్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు చర్చించుకోవడం, తదనుగుణంగా చర్యలు తీసుకోవడం రాజీకయ పార్టీలకు సహజమేనని మాస్‌లైన్ కూడా అదే పని చేసిందన్నారు. ఇల్లందు ప్రాంతంలో చంద్రశేఖర్ ఆర్గనైజర్‌గా రావడానికి వీలు లేదంటూ ఆంక్షలు పెట్టిన మధు లాంటి వ్యక్తులు చంద్రశేఖర్ మానసిక సంఘర్షణకు కారకులన్నారు. దీనికి తోడు కుటుంబ పరిస్థితులు ఆత్మహత్యకు కారణమయ్యాయని దానిని వదిలి తమను తాము సమర్థించుకునే క్రమంలో పార్టీపై నేపం వేస్తున్నారని ఆయన తెలిపారు. ఎన్డికి చెందిన వేములపల్లి వెంకట్రామయ్య, ప్రసాద్, సాదినేని వెంకటేశ్వరరావు తదితరులు మా వ్యతిరేకులను కలుపుకుని నాటకాల రాయుళ్లను మించిపోయే విధంగా మాట్లాడుతున్నారని మా నాయకత్వాన్ని దెబ్బతీయడం ద్వారా పార్టీని బలహీనపర్చాలని కుట్ర పన్నారని రంగారావు తెలిపారు. రెండేళ్ల తర్వాత ఆత్మహత్యను హత్యగా చిత్రీకరించి సమగ్ర విచారణ జరపాలనడం విడ్డూరంగా ఉందని రంగారావు తెలిపారు. వీడియో కూడా పూర్తిగా కల్పితమని ఆయన స్పష్టం చేశారు. పిపితో చంద్రశేఖర్ మాట్లాడినప్పుడు రాజకీయంగా కాకపోయినా మానవీయ కోణంలోనైనా కుటుంబ సభ్యులతో చర్చించాలని ఆ పని ఎందుకు చేయలేదని ఆయన ప్రశ్నించారు. మఠాదిపతులు, పీఠాధిపతులు కమ్యూనిస్టు పార్టీలో ఉంటారా ఈ విషయం ప్రసాద్‌కు తెలియదా అని రంగారావు అన్నారు. ఇప్పటికైనా చంద్రశేఖర్ ఆత్మహత్యకు సంబంధించి ప్రజాస్వామిక వాదులతో వారు కోరుకున్న వ్యక్తులతో విచారణ జరిపితే దానికి మాస్‌లైన్ అన్ని విధాలా సహకరిస్తుందన్నారు. ఫాసిజం పెరిగి దేశ ప్రజలు ఒక విపత్కరపరిస్థితిని ఎదుర్కొంటున్న వేళ సహచర కమ్యూనిస్టు పార్టీలను ఏదో ఒక సాకుతో బలహీన పర్చడం మంచిది కాదని రంగారావు హితవు పలికారు. మీడియా సమావేశంలో నాయకులు కెజి రాంచందర్, కె. రంగయ్య, కె. రమా, ప్రభాకర్, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, సివై పుల్లయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, రామయ్య, శిరోమణి, ఝాన్సీ, శోభ పాల్గొన్నారు.

# తల్లాడలో బెల్ట్‌షాపులపై ఎందుకీ ‘మమత’ కారం..?




**-వైన్ షాపులు, వైన్ గోడౌన్లుగా మారుతున్నాయా...?**
**-క్వార్టర్‌పై అదనపు వసూళ్ల ఆరోపణలు.. డోర్ డెలివరీపై ప్రశ్నలు**

**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ పట్టణం, పరిసర ప్రాంతాల్లో బెల్ట్‌షాపుల నిర్వహణపై అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారిక అనుమతులు లేని ప్రదేశాల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఒకవైపు ఉండగా, కొన్ని వైన్ షాపుల పరిధిలోనే బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా జరుగుతుందనే ప్రచారం మరో వైపు కలకలం రేపుతుంది. వైన్ షాపులకు కేటాయించిన మద్యం స్టాక్ బెల్ట్‌షాపులకు తరలిస్తున్నారా...? లేక కొన్ని ప్రదేశాలు వైన్ షాపుల అనధికార గోడౌన్లుగా మారాయా...? అనే ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ అనుమతి లేని ప్రాంగణల్లో మద్యం నిల్వ చేస్తున్నట్లు తేలితే అది ఎక్సైజ్ నిబంధనల పరిధిలోకి వస్తుంది. కానీ ఆ శాఖ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖ అధికారిక సేవా వివరాల్లో అనధికార ప్రాంగణాల్లో స్టాక్ ఉంచడంపై ప్రత్యేక శిక్షా నిబంధనలు ఉన్నాయి. కానీ వారిలో కొందరు మాములు మత్తులో ఉన్నారేమో అని పలువురు అంటున్నారు.

### క్వార్టర్ బాటిల్‌పై రూ. 25లు అదనమా..?

తల్లాడలో వైన్ షాపుల నుండి బెల్ట్‌షాపులకు క్వార్టర్ బాటిల్‌పై నిర్ణీత ధరకు అదనంగా సుమారు రూ. 25లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని అందరికీ తెలిసిన విషయమే. బెల్ట్ షాప్ నిర్వాహకులు మరో రూ. 25లు అదనంగా పెపంచి విక్రయిస్తున్నారు. వైన్ షాపులలో ప్రజలకు అమ్మితే రూ. 25లు యజమానులకు నష్టం అవుతుందని వైన్ షాపులలో బెల్ట్‌షాపులకు ఎంఆర్‌పి కంటే రూ. 25 పెంచి బెల్ట్‌షాపులకు అమ్ముతున్నారు. ఈ విషయం తెలిసిన అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవటం లేదు. దీంతో అధికారులు షాప్ యజమానులు కుమ్మకై ఈ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలు తాగే బ్రాండులు వైన్ షాపులలో దొరకవు. అలాంటి మద్యం బెల్ట్‌షాపులకు అమ్మి యజమానులు సొమ్ము చేసుకున్నారు. ఏ బ్రాండ్‌పై ఎంత అదనంగా వసూలు చేస్తున్నారు అనే విషయాలపై అధికారులు తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నప్పుడు అధికారులు నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం లైసెన్స్ దారు బాటిల్ పై సూచించిన నిర్ణీత రిటైల్ ధరకు అనుగుణంగానే మద్యం విక్రయించాలి. ధరకు భిన్నంగా విక్రయించడం శిక్షార్హమని శాఖ స్పష్టం చేసింది.

### రైడింగ్‌కు ముందే సమాచారం..?

ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై దాడులకు వెళ్లే సమయంలో ముందుగానే సమాచారం అందుతుందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దాడులు జరిగే సమయానికి షాపులు మూసివేయడం మద్యం స్టాక్‌ను తరలించడం వంటి ఘటనలు జరుగుతున్నాయనే స్థానికుల వాదనలపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారుల వివరణ కోరిన సరైన సమాధానం ఉండవు. ఆధారాలు లేకుండా ఎవరిని బాధ్యులుగా నిర్ధారించడం సరికాదు. ఆరోపణలు నిజమైతే శాఖ అంతర్గతంగా విచారణ జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలి.

### తల్లాడ సెంటర్‌లో వైన్ షాపు మాయాజాలం..?

తల్లాడ ప్రధాన కేంద్రంలో మద్యం అందుబాటులో ఉండే విధానం గురించి కూడా ప్రజల్లో చర్చ జరుగుతుంది. మద్యం ఎక్కడ కావాలంటే అక్కడికి చేరుతుంది. అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫోన్ ద్వారా ఆర్డర్ తీసుకుని ఇండ్లకు లేదా నిర్దిష్ట ప్రదేశాలకు మద్యం చేరవేస్తున్నారా...? అనే అంశం పై కూడా అధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఉంది. లైసెన్స్ పొందిన రిటైల్ షాపుకు సంబంధించిన నియమాలు, అనుమతించిన ప్రాంగణం, వ్యాపార సమయాలు, స్టాక్ నిర్వహణ వంటి అంశాలపై ఎక్సైజ్ శాఖ స్పష్టమైన నియంత్రణలు కలిగి ఉంది.

### నిషేధిత ప్రాంతాల్లో విక్రయాల మాటేమిటి...?

పాఠశాలలు, విద్యా సంస్థలు, ప్రార్థనా స్థలాలు లేదా ఇతర సున్నిత ప్రాంతాల సమీపంలో మద్యం విక్రయాలపై నిబంధనలు ఎలా అమలవుతున్నాయి, బెల్ట్‌షాపుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయా అనే అంశాలను కూడా అధికారులు పరిశీలించాలి.

### ఎక్సైజ్ శాఖ స్పందించాల్సిన సమయం...

తల్లాడలో బెల్ట్‌షాపులపై వస్తున్న ఆరోపణలను సాధారణ ఫిర్యాదులుగా తీసుకోకుండా సమగ్రంగా తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు. వైన్ షాపుల స్టాక్ రికార్డులు, విక్రయాల వివరాలు, సిసి కెమెరా ఫుటేజీ అనుమతించిన ప్రాంగణాలు, ఎంఆర్‌పి విక్రయాలు వంటి అంశాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఎక్సైజ్ శాఖ అధికారికంగా ఉల్లంఘనలకు జరిమానాలు, సస్పెన్షన్, లైసెన్స్ రద్దు వంటి చర్యలను కూడా పేర్కొంది.

### బెల్ట్‌షాపులకు ఎవరి అండ...?

వైన్‌షాపుల నుంచి అక్రమ సరఫరా జరుగుతుందా...? క్వార్టర్‌పై అదనపు వసూళ్ల వెనక ఎవరు...?రైడింగ్‌కు ముందే సమాచారం ఎలా చేరుతుంది...? డోర్ డెలివరీపై నిజానిజాలేంటి...? ఈ ప్రశ్నలకు తల్లాడ ఎక్సైజ్ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని, నిరాధార ఆరోపణలైతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

## రూపారెడ్డి హత్య పట్ల నిరసన వ్యక్తం చేసిన ప్రైవేటు ఉపాధ్యాయులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** నల్లగొండలోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డిని విద్యార్థులే అత్యంత దారుణంగా హత్య చేయడంపై తల్లాడలో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. తీవ్ర దిగ్భ్రాంతికి, ఆవేదనకు గురి చేసిన విషాదకర ఘటన మరోసారి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్య నేర్పిస్తున్న ఉపాధ్యాయులపై విద్యార్థులే ఇటువంటి దాడులు చేయడం అమానుషమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రెండు నిమిషాలు మౌనం పాటించి రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా యూనివర్సల్ స్కూల్ కరస్పాండెంట్ టికె ప్రసన్నన్ మాట్లాడుతూ నేటి సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, మానవీయతను నేర్పించాలని ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. ఉపాధ్యాయుల భద్రతకు సమాజం, తల్లిదండ్రులు, ప్రభుత్వం కలిసి బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మరీ సోఫియా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా విజయ్



**ప్రజాపక్షం/ తల్లాడ :** సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా కొత్తపల్లి విజయ్‌ని మండల కమిటీ నియామకం చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ జన్మదిన సందర్భంగా విజయ్‌ని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తల్లాడ మండలంలో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసేందుకు అవకాశం కల్పించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మండల కమిటీ నాయకులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, అభిమానులకు నిత్యం అందుబాటులో ఉంటూ పార్టీకి సేవలందిస్తానని తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, సొసైటీ ఛైర్మన్ దిరిశాల నర్సింహారావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దుండేటి వీరారెడ్డి, నున్న శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి ఎం. ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు, కల్లూరు టౌన్ ఇంచార్జి కోసూరు వెంకటేశ్వరరావు, బాబురావు, కృష్ణారెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యకర్తలు ఉన్నారు.

## జిల్లా సభను విజయవంతం చేయండి : ఏఐటియుసి



**ప్రజాపక్షం/తల్లాడ :** ఏఐటియుసి ఖమ్మంజిల్లా 17వ మహాసభలను సత్తుపల్లి పట్టణంలో ఈనెల 23, 24న జరగనున్నాయని మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ తల్లాడ మండలంలోని వివిధ గ్రామాల్లో కార్మికులకు తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తాళ్లూరి లక్ష్మి , నిమ్మటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఐటియుసి నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా సభ్యులు మంకెన కృష్ణ మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ తల్లాడ మండల అధ్యక్షురాలు ఇనపనూరి సాయమ్మ, మరియమ్మ, వెంకటమ్మ, ఏసు, గోపాలరావు పాల్గొన్నారు.

## డొంక ఆక్రమణలను తొలగించకపోతే మరో భూ పోరాటానికి సిద్ధం

**సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి**



**ప్రజాపక్షం/మధిరః** మధిర నుండి ఇల్లందులపాడు మీదుగా దెందుకూరు వరకు ఆర్అండ్‌బి రోడ్డుకు ఆనుకొని 100 అడుగుల డొంక రోడ్డును ఆక్రమణదారుల నుండి రక్షించాలని బెజవాడ రవి అధికారులను డిమాండ్ చేశారు. ఈ డొంక రోడ్డును కొంతమంది ఆక్రమణదారులు ఆక్రమించుకొని వ్యాపార సముదాయాలను నిర్మించుకొన్నారని, ఇంకొంత మంది వారి భూమ హద్దులు మార్చి రాళ్లు పాతి ఆక్రమించుకొన్నారని బెజవాడ రవి ఆగ్రమం వ్యక్తం చేశారు. ఈ విషయమై గతంలో సిపిఐ నాయకత్వం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెల్లి జిల్లా సర్వేయర్‌తో ఆగస్ట్2023లో సర్వే చేయించి ఆక్రమణలో ఉన్న భూమిని గుర్తించడం జరిగింది. అయిన కూడా అటు మండల అధికారులు గాని, మధిర మున్సిపాలిటీ పాలకవర్గాలు, అధికారులు కాని ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ ఆక్రమణలు మధిర మున్సిపాలిటీగా మారిన తర్వాత విచ్చలవిడిగా జరుగుతున్నాయని పాలకవర్గాల్లోని కొందరు, అధికారులు కొందరు కుమ్మక్కయి ఆక్రమణదారులు ఇచ్చే కాసులకు కక్కుర్తి పడి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని అప్పనంగా కబ్జాదారుల చేతిలో పెడుతున్నారని బెజవాడ రవి హెచ్చరించారు. ప్రజల అవసరాలను ఉపయోగపడాల్సిన డొంక రోడ్డును తక్షణమే సర్వే చేయించి ఆక్రమణలను తొలగించాలని ప్రజవాణి కార్యక్రమంలో సిపిఐ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఇంకా అధికారులు సదరు ఆక్రమణలో ఉన్న డొంకను స్వాధీనం చేసుకోకపోతే ఇళ్ల స్థలాల కోసం గత రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పేద ప్రజలను, ఇంటి స్థలం కోసం పోరాటం చేస్తున్న పేద జర్నలిస్టు సోదరులను కలుపుకొని మధిర పట్టణ సిపిఐ నాయకత్వం మరో భూపోరాటానికి పిలుపునిస్తుందని ఈ సందర్భంగా అధికారులను బెజవాడ రవి హెచ్చరించారు.